సాక్షి
బాపట్ల
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

పెదలంక(భట్టిప్రోలు): పెదలంకలో కొలువైన వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం జరిగాయి. స్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు.



పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పన

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పిస్తామని తహసీల్దార్ జి.రాఘవేంద్రరావు అన్నారు. ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం స్టేషన్లు పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సేవకు సెల్యూట్

వలంటీర్లకు వందనం కార్యక్రమానికి పోటెత్తిన అభిమాన'జనం'

వలంటీర్లను అవార్డులతో సత్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి | కార్మెల్ మాత కొండ ఘాట్ నిర్మాణానికి రూ. 39 కోట్లు మంజూరు

ఎండనక..వాననక..రేయనక..పగలనక..పథకం ఏదైనా ప్రజలకు అందజేయడమే వారి లక్ష్యం.. నిస్వార్థంగా సేవ చేయడమే వారికి తెలుసు.. చివరకు ప్రజలకు తలలో నాలుకలా మారారు.. వారే వలంటీర్లు. వారి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఇచ్చి గౌరవిస్తున్నారు.



బటన్ నొక్కి నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై మంత్రులు రజిని, ఆదిమూలపు, ఎంపీ నందిగం తదితరులు



విజయ చిహ్నంగా గద చూపుతున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఎమ్మెల్యే సుచరిత

సాక్షిప్రతినిధి,గుంటూరు/తాడికొండ/పట్నంబజార్: అభిమానం పోటెత్తింది. నాలుగేళ్ల కిందట ఏర్పాటైన ముఖ్యమంత్రి మానసపుత్రిక అయిన వలంటీర్ల వ్యవస్థ నేడు ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న వేళ .. వలంటీర్లకు వందనం పేరుతో నిబద్ధతతో పనిచేసిన వలంటీర్లకు అవార్డులు అందచేసే కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం వేదిక అయ్యింది. ఫిరంగిపురం శివారు రేపూడిలో గురువారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి జనాభిమానం పోటెత్తింది. వలంటీర్లు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

- సాయంత్రం 3.20 గంటలకు హెలికాప్టర్‌లో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా ముఖ్య నేతలు, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.
- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత కుటుంబ సమేతంగా వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. సీఎంకి తన కుమార్తె, కుమారుడు, మనువడిని ఆమె పరిచయం చేశారు.
- పది నిమిషాలపాటు కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. అనంతరం సీఎం ప్రత్యేక బస్సులో సభాస్థలికి బయల్దేరారు. అడుగడుగునా గులాబీ పూల వర్షం కురిపించారు. సభాస్థలికి చేరుకున్న అనంతరం నాయకులు, కార్యకర్తలకు సీఎం అభివాదం చేస్తుండగా, అభిమానుల కేరింతలు మిన్నంటాయి.
- వలంటీర్లు దాసరి జోత్స్న, షేక్ జుబేర్‌లు మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థ ద్వారా తాము అందిస్తున్న సేవలకుగాను ప్రభుత్వం ప్రోత్సహించి అభినందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళుతున్నప్పుడు పెన్షన్‌దారుల నుంచి వచ్చే దీవెనలు మాకెంతో ఆనందాన్ని ఇస్తున్నాయని, అందరి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకే ఉన్నత స్థానం కల్పించారని కొనియాడారు.

హోరెత్తిన నినాదాలు

4.30 గంటలకు సీఎం వై.ఎస్.జగన్ తన ప్రసంగాన్ని ప్రారంభించి 5.25 గంటల వరకు కొనసాగించారు. సీఎం ప్రసంగం కొనసాగుతున్నంత సేపు ప్రజలు, వలంటీర్లు, జై జగన్, సీఎం ..సీఎం.. సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీఎం తన ప్రసంగంలో భాగంగా చివరగా ఫిరంగిపురం కార్మెల్‌మాత కొండ ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.39 కోట్లు మంజూరు చేయడంతోపాటు, రాజధానిలో భూమి లేని నిరుపేదలకు అందిస్తున్న జీవన భృతి పెన్షన్‌ను రూ.5వేలకు పెంచుతున్నట్లు ప్రకటించగానే సభా ప్రాంగణం నినాదాలతో మారు మోగిపోయింది.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిరంగిపురం మండల పర్యటనను పురస్కరించుకుని పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పకడ్బందీ



ఏర్పాట్లు చేశారు. తాగునీరు, అల్పాహారం, అందరికి సకాలంలో అందించారు. కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఆదిమూలపు సురేష్, బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, కిలారి వెంకట రోశయ్య, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, తలశిల రఘురామ్, పోతుల సునీత, కల్పలతారెడ్డి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, మంగళగిరి నియోజకవర్గాల సమన్వయకర్తలు బలసాని కిరణ్‌కుమార్, షేక్ నూరిఫాతిమా, గంజి చిరంజీవి, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పఠాన్ ముంతాజ్, ఎం పురుషోత్తం, కోలా భవానీ, ఎం శేషగిరిరావు, పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి..

మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవం వలంటీర్ల వ్యవస్థ. వారి ద్వారా ప్రజలకు సేవలందించటం సంతోషదాయకం. వలంటీర్లపై అవాకులు, చవాకులు మాట్లాడిన పరిస్థితులను రాష్ట్రమంతా చూశారు. వ్యాఖ్యలు చేసిన నోటితోనే శభాష్ అనేలా పరిపాలన అందేలా చేశారు. ప్రతి నెలా 1వ తేదీన చక్కని చిరునవ్వుతో అవ్వతాతలకు వలంటీర్లు పింఛన్‌లు అందజేస్తూ...వారి కుటుంబ సభ్యులుగా మారిపోయారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. వృద్ధులు ఆఖరికి వారికి ఫోన్ చేసి చెప్పుకునే పరిస్థితులు ఏర్పడటం అభినందనీయం. కోవిడ్ కల్లోల సమయంలో సైతం, కుటుంబ సభ్యులు పట్టించుకోని పరిస్థితుల్లో కూడా, వలంటీర్లు వారి కుటుంబాలను వదలిపెట్టి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగ విప్లవంతో పారదర్శకంగా వలంటీర్ల సైన్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. రాజధాని ప్రాంతంలో నిరుద్యోగ భృతి రూ 3వేలు ఇస్తున్నారు.. దానిని రూ 5వేలు చేయాలని సీఎం జగనన్నను కోరుతున్నాను. ఫిరంగిపురంలోని కార్మెల్‌మాత చర్చికి సంబందించి ఘాట్ రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నా.

ప్రభుత్వం.. ప్రజలకు మధ్య వారధి

ఎం.వేణుగోపాలరెడ్డి, జిల్లా కలెక్టర్

దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన వ్యవస్థ వలంటీర్లు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రజలకు వద్దకు సంక్షేమాన్ని తీసుకుని వెళ్తున్న వలంటీర్లు అభినందనీయులు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తూ.. ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్తూ.. పరిపాలన మరింత సులభతరం చేస్తూ.. ప్రతి అంశంలో పేదవర్గాలకు వలంటీర్లు సేవలందిస్తున్నారు. సంక్షేమ క్యాలెండర్ ద్వారా ఎప్పుడు ఏ పథకం వస్తుందో తెలియజేస్తూ..ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించటం అభినందనీయం. జిల్లాలో 11.087 మంది వలంటీర్లకుగాను 10,552 మందికి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు వచ్చాయి. శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.



థ్యాంక్యూ జగనన్న అంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

బాచిన గరటయ్య సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, బాపట్ల : అద్దంకి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, ఆయన తనయుడు బాచిన కృష్ణచైతన్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. గరటయ్య, చైతన్యలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ వారి ఇరువురిని సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ కేంద్రకార్యాలయం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది.

సోమేశ్వరస్వామి దేవాలయానికి శంకుస్థాపన



బాపట్ల: బాపట్ల పట్టణంలోని సోమేశ్వరస్వామి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి నిర్వహించా రు. గురువారం ఉదయం భక్తిశ్రద్ధలతో హోమం చేపట్టారు. ఆలయం ప్రధాన అర్చకులు బాబీ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, ఆయన సతీమణి రమాదేవిస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి వారి చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో సోమేశ్వరస్వామి దేవాలయంలో కె.శివరామప్రసాద్, కొటికం సుబ్బారావు, వెదురుపర్తి లక్ష్మణమూర్తి, కొత్రా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



చీరాల: లారీ డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ జిల్లా అధికారి ఆర్ సురేష్ అన్నారు. 35వ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా చీరాలలో బాపట్ల జిల్లా రవాణా శాఖ, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ కంటి హాస్పిటల్ వైద్యులు వరికూటి అమృతపాణి, డాక్టర్ ఎస్.శ్వేత పాల్గొని 400 మంది మిని లారీ డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, లారీ ఓనర్లకు కంటి పరీక్షలతో పాటు షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. నిర్దిష్ట వేగంతో వాహనం నడపాలని, అతి వేగం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఓవర్ టేక్ చేసే సమయంలో ఎదుట వాహనాలు లేనప్పుడే చేయాలని డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్లు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

19 మందికి హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి



గుంటూరుమెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 19 మందికి గుంటూరు ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్‌నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కౌన్సెలింగ్‌కు 20 మందిని పిలువగా, ఒకరు ఉద్యోగోన్నతి వద్దని లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

యోగా గురువు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ యునాని, న్యాచురోపతి యోగ వైద్యశాలలో యోగా గురువుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ రావూరి మౌనిక తెలిపారు. యోగాలో పీజీ, లేదా డిప్లమోలో అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులు యోగా గురువులుగా పనిచేసేందుకు కావాలన్నారు. మహిళ యోగా గురువుకు ప్రతిరోజూ గంటకు రూ. 250 చొప్పున, 20 గంటలకు నెలకు గౌరవ వేతనంగా రూ. 5వేలు అందిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 8309599643 నంబరులో సంప్రదించాలని యునాని వైద్యురాలు డాక్టర్ మౌనిక కోరారు.

తెల్లారిన కూలీల బతుకులు

- కారును ఆటో ఢీకొన్న ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతులు
- చికిత్స పొందుతున్న మరో ముగ్గురు కూలీలు
- ఒకే గ్రామంలో నలుగురి మృతితో విషాదఛాయలు

అద్దంకి: బతుకుదెరువు నిమిత్తం మిరపకాయల కోత కూలి పనులకు వెళ్లిన కూలీలు ఇంటి ముఖం చూడకుండానే రోడ్డు ప్రమాద దుర్ఘటనలో మృత్యువాత పడ్డారు. ఈ ఘోర ప్రమాదం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని అద్దంకి -నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరు గ్రామ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు, ఇద్దరు కూలీలు మృతి చెందారు. గురువారం వైద్యశాలలో చికిత్స పొందుతూ మరో మహిళా కూలీ మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలు శోక సముంద్రంలో మునిగిపోయాయి.

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన షేక్ మౌలమ్మ(70), గుండుమల్లి వెంకాయమ్మ(65), సాంబులు(65), ఎం లక్ష్మమ్మ, ఎస్ తిరుపతమ్మ, అలివేలమ్మ, అంజమ్మ కూలీలు వీరంతా గ్రామానికి చెందిన అల్లాహు అబ్దుల్(50) ఆటోలో ప్రతి రోజూ ఏల్చూరు గ్రామ సమీపంలోని చక్కలవాగు పొలాలకు వెళ్లి కాయలు కోసి సాయంత్రం మరలా అదే ఆటోలో తిరిగి ఇంటికి వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన అల్లాహు అబ్దుల్ ఆటోలో కోతకు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం సమయంలో కోత పూర్తి కాగానే ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఆటో రాష్ట్రీయ రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలకు సమీపంలోకి రాగానే చెన్నై నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొడుతూ సైడులోకి దూసుకెళ్లి తిరగబడింది. దీంతో ఒక కూలీ అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సంతమాగులూరు సీఐ నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో తన జీపులో క్షతగాత్రులను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ అల్లాహ్ అబ్దుల్‌తోపాటు, ఎనిమిదిని వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ అల్లాహు అబ్దుల్, కూలీలు వెంకాయమ్మ, ఎస్‌కే మౌలమ్మ చికిత్స పొందుతూ మృతిచెందారు. చికిత్స పొందుతూ గురువారం మరో కూలి సాంబులు మృతి చెందింది. మరో ముగ్గురు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చిన హనిమిరెడ్డి

కుమారుడి బదులు ఆటో నడపటానికి వెళ్లి..

అల్లాహు అబ్దుల్ ది ఏల్చూరు గ్రామం. ఈయనకు ఇద్దరు కుమారులు. వీరికి రెండు ఆటోలున్నాయి. కుమారుడు హసన్ వలీ ఒక ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. కుమారుని బదులు తండ్రి అల్లాహు అబ్దుల్ కూలీలను ఎక్కించుకుని రావడానికి వెళ్లి మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది.

- మరో మృతురాలు గుండుమల్లి వెంకాయమ్మకు నలుగురు కుమారులు. వీరిలో కుమారుడు బ్రహ్మం వలంటీరు. ఈమె ప్రతి రోజూ మిరపకాయల కూలీకి వెళ్లి వస్తుంటుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెండడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.
- షేక్ మౌలమ్మకు ముగ్గురు అమ్మాయిలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుని వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తుంది. కుమారుడు కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. హఠాత్తుగా తల్లి మృతితో దిగ్భ్రాంతికి లోనయ్యాడు.
- సాంబులుకు భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెక్కాడితేనే డొక్కాడని కుటుంబం. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.



వెంకాయమ్మ,అల్లాహు అబ్దుల్, షేక్‌మౌలమ్మ(ఫైల్)

చిన హనిమిరెడ్డి పరామర్శ

మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పరామర్శించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే వైఎస్సార్ ఆసరా



నగరం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా కార్యక్రమం కింద విడతల వారీగా నగదు అందిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత కింద నగరం మండలానికి రూ.7.99 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుకావడం లేదన్నారు. సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా ఎటువంటి అవినీతికి తావు లేకుండా కుల,మత,రాజకీయాలకతీతంగా ప్రజలకు చేరుతున్నాయన్నారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌పనిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద 1044 డ్వాక్రా గ్రూప్‌లలోని 10,269 మంది సభ్యులకు రూ.7.99 కోట్ల చెక్కు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'విజ్ఞాన్'



చేబ్రోలు: గుంటూరులోని జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం ప్రతి ఏటా నిర్వహించే 27వ ఎడిషన్ 'చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్' ఉల్లాసంగా సాగింది. విజ్ఞాన్ యూనివర్సిటీ వరుసగా రెండోసారి గెలిచి ట్రోఫీను నిలబెట్టుకుంది. జేకేసీ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టు మీద 94 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 206 పరుగులు చేసింది. విజ్ఞాన్ బ్యాట్స్‌మెన్ ఎస్.వినోత్ 100(58 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సులు) తో సెంచరీ సాధించాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్‌లలో మాదినేని లోకేష్ (18బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో) చివర్లో ఫోర్లు, సిక్స్‌లతో 47 పరుగులు చేశాడు. 207 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల 15.4 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయింది. విజ్ఞాన్ బౌలర్లలో కెప్టెన్ శ్రీకాంత్ నల్లపనేని, మాదినేని లోకేష్‌లు చెరో మూడు వికెట్లు తీసి జట్టును విజయతీరాలకు చేర్చారు. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఎస్.వినోత్ (విజ్ఞాన్స్ యూనివర్సిటీ), మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా మాదినేని లోకేష్ (విజ్ఞాన్స్ యూనివర్సిటీ), టోర్నీలో బెస్ట్ బౌలర్‌గా కెప్టెన్ శ్రీకాంత్ నల్లపనేని (విజ్ఞాన్స్ యూనివర్సిటీ) నిలిచారు. జేకేసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ చేతుల మీదుగా కెప్టెన్ నల్లపనేని శ్రీకాంత్ ట్రోఫీను అందుకున్నారు. చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన క్రికెట్ టీమ్ సభ్యులను గురువారం విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పీ.నాగభూషణ్ అభినందించారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం

తాడేపల్లిరూరల్: స్థానిక సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం సకల శుభాలు, కార్యసిద్ధి కోసం సుదర్శన హోమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కలియుగ ప్రత్యక్ష దైవం, విజయకీలాద్రి వాసుడైన శ్రీ వెంకటేశ్వరస్వామి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జీయర్‌స్వామి స్వహస్తాలతో భక్తులకు, వేద విద్యార్థులు తీర్థగోష్ఠి, సాయంత్రం సామూహిక లక్ష్మీ నారాయణ పూజ జరిగాయి. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని చంద్రప్రభ వాహనం, గజ వాహనంపై ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాలకు తరలివచ్చారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు, విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మార్చి 2 నుంచి ఎడ్ల బలప్రదర్శన

రెంటచింతల: మహాశివరాత్రి పురస్కరించుకుని జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శన పోటీలు మార్చి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పులి ఓబుల్‌రెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సారథ్యంలో సత్రశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంగా భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలోని అఖిలభారత రెడ్లకుల గురువు శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రం మైదానంలో ప్రదర్శన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 6 విభాగాలకు గాను ఒక్కొక్క విభాగంలో 7,8 బహుమతులు చొప్పున 44 బహుమతుల ద్వారా రూ.11 లక్షలు విజేతలైన రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9908775005, 8106183818, 8096154409, 9704005849లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, గాదె వీరారెడ్డి, గొట్టం సైదారెడ్డి, జక్కిరెడ్డి అంజిరెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రజిని, ఎమ్మెల్యే సుచరిత, చిత్రంలో డాక్టర్ ఉమ్మారెడ్డి



జై జగనన్న ప్లకార్డులతో వలంటీర్లు



సభకు తరలివస్తున్న ప్రజలు, వలంటీర్లు

జగనన్నే స్ఫూర్తి – సేవా దృక్పథమే దీప్తి

రేపూడి సభకు తరలివచ్చిన వలంటీర్లు, ప్రజలు

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారులోని పీఎస్‌సీ అండ్ విజయ్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసభకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సభకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, జిల్లాల నుండేకాక వివిధ ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున వలంటీర్లు హాజరయ్యారు. కాగా పలువురు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తామంతా వలంటీర్లుగా పనిచేసేందుకు ముందుకు వచ్చామని వలంటీర్లు వెల్లడించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటిముంగిటకు చేర్చుతూ జగనన్న సైనికుల్లా పనిచేస్తామని చెప్పారు. పారితోషకం గురించి పట్టించుకోకుండా సేవాభావం తమ లక్ష్యమని తెలిపారు. పథకాల అమలులో అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వం ఇచ్చే లబ్ధిని చేకూర్చడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. ఏటా ప్రభుత్వం, జగనన్న తమసేవలను గుర్తించి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రల వంటి అవార్డులు ఇచ్చి గౌరవించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో, ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. జగనన్న ఆశయాల సాధనే తమలక్ష్యమని రానున్న రోజుల్లో మరలా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి రావాలని ఆకాక్షించారు.

చెప్పలేని ఆనందంగా ఉంది



ఫిరంగిపురం సచివాలయం -1, 13వార్డుకు చెందిన నాకు సేవా వజ్ర ఇచ్చి గౌరవించడం ఎంతో ఆనందంగా ఉంది. అదీకాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా అవార్డు తీసుకోవడం మరింతగా సంతోషం వేసింది. ఇంకా కష్టపడి అర్హులకు పథకాలు అందేలా చేస్తాను.

– పి.వేళాంగిణి సుమ, ఫిరంగిపురం

జగనన్నకు వందనం



తెనాలి చిన్నరావూరితోట 14వార్డులో వలంటీరుగా పనిచేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న నన్ను గుర్తించి టెస్ట్ మోనియల్‌లో సేవా రత్న అవార్డుకు ఎంపిక చేయడం ఆనందాన్ని ఇస్తుంది. సేవలు గుర్తించి అవార్డు అందించిన జగనన్నకు వందనం.

– సయ్యద్ మల్లిక, తెనాలి

పేదలకు సేవలందిస్తా



సత్తెనపల్లి గ్రామానికి చెందిన నేను వలంటీరుగా పనిచేస్తున్నా. అర్హులకు పథకాలు అందేలా చేయడం సంతోషాన్నిస్తుంది. సేవలను గుర్తించి సేవా మిత్ర అవార్డు ఇవ్వడం ఆనందాన్నిస్తుంది. మరలా జగన్‌మోహన్ సీఎం కావాలి. అవార్డు రావడం గర్వంగా ఉంది.

– వి.సాహితీ, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా

జగనన్న సైనికుడిలా పనిచేస్తా



మంద్రు జయగోపాల్, పొన్నూరు, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం నిడుబ్రోలు నాగుల చెరువులో వలంటీరుగా పనిచేస్తాను. నాకు సేవా రత్న రావడం గొప్పగా భావిస్తాను. అర్హులను గుర్తించి అందరికి పథకాలు అందేలా చేస్తూ జగనన్న సైనికుడిలా పనిచేస్తాను.

– మంద్రు జయగోపాల్. (పొన్నూరు)

గర్వంగా ఉంది



ప్రజలకు సేవలందిస్తున్న నన్ను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది. పదిమందిలో గుర్తింపునిస్తుండం సంతోషాన్ని ఇస్తుంది. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు.

– షేక్ జానీ బాష, రెంటచింతల, పల్నాడు జిల్లా

జగనన్నతోనే వలంటీర్లకు గుర్తింపు



గుంటూరు అమరావతిరోడ్డు-2 సచివాలయంలో పనిచేస్తాను. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంతో నా పాత్ర ఎంతో కీలకంగా భావిస్తాను. అర్హులను గుర్తించి వారికి పథకాలు అందించడం సంతోషాన్నిస్తుంది. వార్డులో పనిచేసే మమ్మల్ని జగనన్న గుర్తించి సేవారత్న అవార్డు లందించడం ఆనందంగా ఉంది.

– కె.నిఖిల, గుంటూరు

అర్హులకు న్యాయం చేయడమే



జగనన్న ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేస్తారని ఆయన అడుగుజాడల్లో నడిచే మమ్మల్ని ప్రజలు ఎంతో గౌరవంగా చూస్తున్నారు.

– పి.శిరీష, తెనాలి

కష్టించి పనిచేస్తాం



ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంలో జగనన్న సేవకులుగా కష్టించి పనిచేస్తాం. ఉదయాన్నే పింఛన్ దారులకు పింఛన్ అందించడం వారి కళ్లల్లో ఆనందం చూస్తే వలంటీరుగా చేస్తున్నందుకు గర్వంగా ఉంది.

– అమూల్య(ఫిరంగిపురం-1)

నగరం శివాలయంలో చోరీ

నగరం: స్థానిక శివాలయంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. పోలీసులు కథనం మేరకు.. శివాలయంలోని కానుకల హుండీని గుర్తుతెలియని దుండగులు పగలుగొట్టి నగదును అపహరించారు. సుమారు రూ.50 వేల వరకు ఉండవచ్చునని చెబుతున్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించి దొంగతనానికి పాల్పడినవారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

సంక్షేమం ఘనత వైఎస్ జగన్‌దే



ఎమ్మెల్యే కరణం బలరాం, వెంకటేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు
- హాజరైన ఎమ్మెల్యే కరణం, సమన్వయకర్త వెంకటేష్

చీరాల: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. వేటపాలెం నాయకుడు బండికళ్ల నరేష్ ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు నలమల్ల దావీదు, వేర్పుల రవి, అలెక్స్, ఐనయ్య, రాజేష్ మరో 165 మంది ఎమ్మెల్యే కరణం, వెంకటేష్‌ల సమక్షంలో రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి సమన్వయకర్త వెంకటేష్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంతో పాటుగా రానున్న ఎన్నికల్లో చీరాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కరణం వెంకటేష్‌ను గెలిపించడంతో పాటుగా ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకోవాలని కోరారు. వెంకటేష్ మాట్లాడుతూ 2019లో .సీఎంగా అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పథకాలను అందించి ప్రతీ కుటుంబం ఆర్థిక సుస్థిరతకు కృషి చేసిన సీఎంగా వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. అన్నగా, తమ్ముడిగా, పెద్ద కొడుకుగా ఉన్న సీఎం జగనన్నకు అండగా నిలిచే సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల అర్థం కాని విధంగా అత్యధిక మెజార్టీతో మళ్లీ సీఎంగా జగనన్నను, చీరాల ఎమ్మెల్యేగా నన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి అన్నివిధాలు అండగా నిలుస్తున్న జగనన్న మళ్లీ సీఎం అయితే అన్నీ పథకాలు కొనసాగుతాయని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు, కౌన్సిలర్లు బత్తుల అనీల్, కీర్తి వెంకటరావు, సతన్యానందం, యువజన నాయకులు యాతం మేరిబాబు, బండికళ్ల నరేష్, యాతం సునీల్ పాలొన్నారు.

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులు

- సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను
- ఆర్‌వీఆర్‌జేసీలో ప్రారంభమైన కొలరిడో 2024 నేషనల్ ఫెస్ట్



గుంటూరు రూరల్: ప్రపంచంలో అద్భుతాలను సృష్టించేది ఇంజినీర్ విద్యార్థులేనని, క్రమ శిక్షణతో కూడిన విద్య ఉజ్వల భవిష్యత్తుకు నాందీ పలుకుతుందని ప్రముఖ చలనచిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రెండు రోజుల పాటు కొలరిడో-2024 పేరుతో జరుగుతున్న నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్‌లో యన ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయపాటి మాట్లాడుతూ తానూ కూడా జేకేసీ కళాశాల నుండే విద్యనభ్యసించానన్నారు. గురువులు నేర్పిన క్రమశిక్షణతోనే తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానం రావడానికి కారణమైందన్నారు. కనీపెంచే తల్లిదండ్రులే దేవుళ్ళని, ప్రతి యువత సమాజ శ్రేయస్సులో భాగస్వాములవ్వాలన్నారు. ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరు దానిని బాధ్యతగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఆలోచనలతో బ్యాలెన్స్ చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎన్నికల సమరంలో విజయం మనదే



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కుటుంబాలతో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- వైఎస్సార్ సీపీ సమన్వయర్త చిన హనిమిరెడ్డి
- టీడీపీ నుంచి 50 కుటుంబాలు చేరిక

అద్దంకి: రానున్న ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, తెలుగుదేశం నుంచి ప్రతి రోజూ వైఎస్సార్ సీపీలోకి చేరుతున్న కుటుంబాలను బట్టి చూస్తే అర్థమవుతోందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంపరాలకు చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి గ్రామ నాయకుడు యడ్లపల్లి అహరోను ఆధ్వర్యంలో సమన్వయకర్త హనిమిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి సమన్వయకర్త కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అద్దంకి చరిత్రలో లేని విధంగా అత్యధిక మెజారిటీతో గెలుపొందటం ఖాయమన్నారు. ఇదే ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు, పార్టీకి వెన్నుదన్నుగా ఉండి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేలు జరిగిన కుటుంబాల దగ్గరికి వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించాలని సూచించారు. ప్రతి గడపలో లబ్ధిపొందని కటుంబం లేదంటే అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎప్పటికప్పుడు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు హితవు పలికారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో ప్రతిభకు పట్టం



క్రీడాకారులతో ఎంపీ మోపిదేవి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- విజయం సాధించిన వాలీబాల్ జట్టుకు సత్కారం

నిజాంపట్నం: ఆడుదాం ఆంధ్రా క్రీడలతో ఆణిముత్యాలను వెలికి తీసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో వాలీబాల్ విభాగంలో నిజాంపట్నం సచివాలయం-3 టీం రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతిని సాధించిన సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడలను పెట్టిందన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడా కారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ 47 రోజులపాటు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్థాయి, వార్డు స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం గుర్తించని విధంగా క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి అండగా నిలిచిందని చెప్పారు. నిజాంపట్నం సచివాలయం-3 టీం రాష్ట్ర స్థాయి వాలీబాల్‌లో ప్రథమ బహుమతిని సాధించడం మనందరికీ గర్వకారణమని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ మాజీ ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పాండురంగ కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ధర్మకర్తల మండలి నిర్వాహకులు గురువారం తెలిపారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పురస్కారాలకు ఏడుగురు వలంటీర్లు ఎంపిక



చెరుకుపల్లి: వలంటీర్ల నగదు పురస్కార మహాసభకు మండలం నుంచి 294 మంది వలంటీర్లు తరలి వెళ్లినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి చెప్పారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించే వలంటీర్ల సేవా పురస్కార సభకు ఆరు బస్సులలో తరలి వెళ్లారని తెలిపారు. మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలోని ఏడుగురు వలంటీర్లకు పురస్కారాలు దక్కనున్నాయని తెలిపారు. ఫిరంగిపురం సభకు వలంటీర్లు వెళ్లే బస్సులను కార్యదర్శులతో కలిసి సాగనంపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయ్‌బాబు, కార్యదర్శులు మురళీ, డోగేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

రామభక్తుడు శివన్నారాయణకు సన్మానం



బాపట్ల: రామభక్తుడు చీమలదిన్నె శివన్నారాయణను బాపట్ల విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బాపట్ల విశ్వహిందూ పరిషత్ సభ్యులైన చీమలదిన్నె శివన్నారాయణ శ్రీరామ జన్మభూమి మందిరం అయోధ్యలో ప్రతిష్ఠించబడిన బాలరాముని దర్శించుకుని పవిత్రమైన అక్షింతలను బాపట్ల ప్రజలకు అందించారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు బండ్రెడ్డి రజని బృందం శివన్నారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగలకుదురు నటరాజన్, శేషగిరిరావు, సింగారావు, లక్ష్మీ సామ్రాజ్యం, గృహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కొల్లూరు : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం కొల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లూరులో గత పదిహేను రోజుల నుంచి తిరుగాడుతున్న వ్యక్తి స్థానిక బాలికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాల వద్ద మృతి చెందాడు. గురువారం ఉదయం మృత దేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వేరే ప్రాంతం నుంచి వచ్చిన మతి స్థిమితం లేని వ్యక్తి గానీ, యాచకుడు గానీ అయి ఉండవచ్చునని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృత దేహాన్ని కొల్లూరు పంచాయతీ సిబ్బందికి అందజేయడంతో పారిశుద్ధ్య సిబ్బంది ఖననం చేశారు.

జీఈసీలో ఉచిత కంటి వైద్య శిబిరం

యనమదల (ప్రత్తిపాడు): మండల పరిధిలోని యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, నేత్రాలయ ఐకేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ షేక్ సైదా, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకోటయ్య, కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో 3వ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. నారాకోడూరులోని తెనాలి రోడ్డులో నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగ సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెద్ది శివయ్య, వై ఉదయభాస్కర్, చావలి ఏడుకొండలు యాదవ్, జంపని సూర్యనారాయణ, గైరుబోయిన వెంకట సుబ్బయ్య, తొలుచూరి కాటంరాజు, గుమ్మా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో జీవించాలి

నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ దేవుడి పట్ల భక్తి భావం అలవర్చుకుని ఆధ్యాత్మిక భావంతో జీవించాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని కనగాల గ్రామంలో బుధవారం నూతన జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పాలక మండలి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గణేష్ మాట్లాడుతూ కనగాల గ్రామంలో శ్రీ పృథ్వీశ్వర స్వామి ఆలయాన్ని వందేళ్ల క్రితం నిర్మించారని ఇది గొప్ప శిలా శాసనాలు గల ఆలయమని గ్రామ పెద్దల ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. ఇంతటి చరిత్ర కలిగిన గుడి ధ్వజస్థంభం శిథిలావస్థకు చేరటంతో దానిని తొలగించి నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు ఇదే గ్రామానికి చెందిన జంపాని శ్రీనివాసరావు, వెంకట రమ దంపతులు ధ్వజస్తంభం ఏర్పాటుకు ముందుకురావటం అభినంద నీయమన్నారు. అనంతరం డాక్టర్ ఈవూరి గణేష్ ప్రతిష్ఠా కార్యక్రమానికి ఖర్చులు నిమిత్తం రూ.30 వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దుంపా ప్రసాదరావు, కార్యనిర్వహణ అధికారిణి అనుపమ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వేద పండితులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న పరిసర గ్రామాల భక్తులు



ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఈవూరి గణేష్, భక్తులు

కనుల పండువగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చెరుకుపల్లి: కనగాల గ్రామంలోని గంగా పార్వతీ సమేత శ్రీ పృథ్వీశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 09.03 గంటలకు భారీ క్రేన్ సాయంతో ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహక అధికారిణి మంతెన అనుపమ, ఆలయ ప్రధాన అర్చకులు చావలి జనతారావు, ఆలయ పాలకమండలి చైర్మన్ దుంపా ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

మూల్పూరు(వేమూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేమూరు నియోజక వర్గంలోని అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గురువారం వీరంతా పార్టీలో చేరారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటుగా నిలవడంతో వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వీరంతా తెలిపారు. వీరందరినీ వరికూటి అశోక్‌బాబు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో అందరికీ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.



పార్టీలోకి చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి

విద్యార్థులు ప్రణాళికతో చదువులు కొనసాగించాలి

జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు

చెరుకుపల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సమయం వృథా చేయకుండా ప్రణాళికా బద్ధంగా చదవాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కాలె నారాయణరావు సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. హెచ్‌ఎం కవితతో కలిసి పాఠశాల పరిసరాలు, వంటశాల, నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని పదో తరతగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు జీవితంలో ఉన్నత చదువులు చదివేందుకు పదో తరగతి ఎంతో కీలకమన్నారు. టీవీలు, సెల్‌ఫోన్‌ల వినియోగంతో కాలం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి.నవీన్ కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహిస్తున్న డీఈవో

మహిళాభ్యుదయానికి ప్రభుత్వం కృషి

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేత

నిజాంపట్నం: పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి 4 విడతలుగా రుణాల మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ లక్షలాది మంది పొదుపు సంఘాల అక్కా చెల్లెమ్మలకు అండగా నిలిచి ఇచ్చిన మాటను నెరవేర్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పొదుపు సంఘాల మహిళల జీవితాలలో వెలుగులు నింపేలా 4 విడతలుగా రుణాలను మాఫీ చేసి మహిళలకు అండగా నిలిచిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. మండలంలో 1,416 పొదుపు సంఘాలకు రూ.13.66 కోట్ల సొమ్ము విడుదలైనట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తిరిగి కొనసాగించాలంటే రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్

సీఎం సభకు తరలి వెళ్లిన వలంటీర్లు



భట్టిప్రోలు: గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు భట్టిప్రోలు మండలం నుంచి వలంటీర్లు గురువారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండల పరిధిలోని 12 సచివాలయాల నుంచి వలంటీర్లు ప్రత్యేక బస్సుల్లో ఫిరంగిపురం తరలి వెళ్లారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివార్లకు మహా పూర్ణాహుతి, మహా నివేదన, హారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. రాత్రికి రథాంగ హోమం నిర్వహించిన అనంతరం సిద్ధి బుద్ధి గణపతి స్వామివారి రథోత్సవం నేత్రానందంగా సాగింది.

విభజన హామీలపై ప్రజలకు అవగాహన

బాపట్ల అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయి పదేళ్లయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆనాటి విభజన హామీలను నేటికీ పరిష్కరించక పోవడం బాధాకరమని జనవిజ్ఞాన వేదిక నాయకుడు, నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలోని చైతన్య భవన్లో ఆయన మాట్లాడారు. 2014 విభజన తర్వాత విభజనలో ఉన్న హామీలు, ప్రత్యేక హోదాను పాలకులు మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో పొందుపరిచిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పారన్నారు. ఈ విషయంపై అప్పట్లో ప్రతి పక్షంలో ఉన్న బీజేపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లు కాదు పదేళ్లకు పెంచుతామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. దీనిపై నవ్యాంధ్ర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రజలకు చైతన్య పరిచే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. సభలు, సమావేశాలు, కరపత్రాలు ముద్రించి అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కొల్లూరు : ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని కొల్లూరు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అన్నారు. గురువారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాంచారమ్మ మాట్లాడుతూ..ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులకు అందజేసే నూతన పథకాల గురించి ప్రజా ప్రతినిధులకు తెలియజేయడంతో పాటు వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండల కేంద్రంలో అందుబాటులో ఉంటూ, రక్షిత మంచినీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. వివిధ శాఖాపరమైన సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాంచారమ్మ

కేదారేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కర్లపాలెం: అగ్రహారంలోని గంగా గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి పూజలు నిర్వహించారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవీరాజుపాలెం గ్రామానికి చెందిన గ్రామ సచివాలయ కన్వీనర్ ఆట్ల నాగిరెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కోన రఘుపతి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేసి అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, మార్పు బెనర్జి, చిక్కాల సాగర్, మూనగల అయ్యప్పరెడ్డి, మార్పు రత్నం, ఆట్ల గిరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోన

వైభవంగా భావనారుషి కల్యాణం

తెనాలిటౌన్: పట్టణ షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న శ్రీ భద్రావతి సహిత భావనారుషి స్వామివారి వార్షిక కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మార్కెట్ సెంటర్‌లో ఉన్న కల్యాణ మండపంలో భావనారుషిస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. పద్మశాలి ఆడపడుచులు, పద్మశాలీయుల బంధువులు, పట్టణంలోని ప్రజలు కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, పద్మశాలీ సంఘ అధ్యక్షుడు బట్టు జగత్ కోటి నరేంద్రబాబు, సెక్రటరీ కొడాలి క్రాంతి కుమార్, దేవస్థాన పాలక మండలి సభ్యులు గుంటి ధనలక్ష్మి, తాడిపర్తి చంద్రశేఖరరావు, కొతరపు వెంకటరమణ, పోలిశెట్టి కోటేశ్వరరావు, సంఘ పెద్ద శ్రేష్ఠులు జొన్నాదుల కృష్ణ, సత్యనారాయణ, వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివసత్యనారాయణ, వరప్రసాద్, అధిక సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యువకుడిపై దాడి ఘటనలో కేసు నమోదు

కొల్లూరు : యువకుడిపై దుకాణ యజమాని, దుకాణంలోని వర్కర్లు దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు బైపాస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన బొందలపాటి శివవినయ్ కుమార్ పది నెలల క్రితం కొల్లూరులోని నందన్ సప్లయర్స్ దుకాణంలో బ్యాంక్ ఇన్‌స్టాల్‌మెంట్‌లపై టీవీ కొనుగోలు చేశాడు. ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాలని ఓ ప్రైవేటు బాంక్‌కు చెందిన వ్యక్తులు ఫోన్ చేయడంతో ఇన్‌స్టాల్‌మెంట్‌లు చెల్లిస్తూనే ఉన్నామని, మిగిలినవి చెల్లించడానికి గడువు ఉందని బ్యాంక్‌కు చెందిన వ్యక్తులకు సమాధానం చెప్పాడు. బ్యాంక్‌కు చెందిన వ్యక్తులకు, శివవినయ్ కుమార్‌కు మధ్య వాగ్వాదం పెరగడంతో బ్యాంక్ నుంచి ఫోన్ చేసిన వ్యక్తులు అసభ్య పదజాలంతో దూషణలకు దిగారు. దీనితో ఆగ్రహించిన వినయ్‌కుమార్ తాను టీవీ కొనుగోలు చేసిన దుకాణం వద్దకు వెళ్లి ఇన్‌స్టాల్‌మెంట్ కోసం ఫోన్ చేసిన వ్యక్తులు ఎవరంటూ దుకాణదారులను నిలదీయడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. దీనితో దుకాణ యజమాని గోపితో పాటు, అదే దుకాణంలో పనిచేసే నలుగురు వ్యక్తులు వినయ్ కుమార్‌పై మూకుమ్మడి దాడికి దిగడంతో తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దుకాణ యజమాని గోపితో పాటు, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కొల్లూరు : రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన కొల్లూరు సమీపంలోని గాంధీనగర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని క్రాపకు చెందిన కామినేని వెంకటేశ్వరరావు తన కుమార్తెను గురువారం రాత్రి కొల్లూరులో ట్యూషన్ నుంచి ద్విచక్ర వాహనంపై తీసుకొని ఇంటికి వెళుతున్నాడు. మరో ద్విచక్ర వాహనంపై మొసలిపాడుకు చెందిన యువకులు కట్టుపల్లి అజయ్, కంచరం అశోక్‌లు కొల్లూరు నుంచి వెళుతున్నారు. వీళ్లకు ఎదురుగా వస్తున్న లారీ ముందు వెళుతున్న మరో వాహనాన్ని అధిగమించే క్రమంలో అజయ్, అశోక్‌లు పయనిస్తున్న ద్విచక్ర వాహనంపైకి దూసుకొచ్చింది. దీంతో వారు నియంత్రణ తప్పి వారి ముందు వెళుతున్న వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనానికి వెనుక నుంచి ఢీకొన్నారు. దీనితో వెంకటేశ్వరరావు తన కుమార్తెతో వెళుతున్న ద్విచక్రవాహనం అదుపు కోల్పోయి లారీ చక్రాలకు తగలడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు పడిపోయారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న వీరంతా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ప్రాంతానికి చేరుకున్న కొల్లూరు పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి

పొన్నూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణతో కూడిన విద్య అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్నటువంటి విపరీతమైన మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రతి విద్యార్థికి మొక్కలు పెంచివలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శోభాచంద్, శ్రీనివాసరెడ్డి, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్, పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న స్రవంతి

శ్రీసంత్ సేవాలాల్ 285వ జయంతి

తెనాలి: సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని గురువారం రాత్రి చినరావూరుతోట సుగాలి కాలనీలో ఘనంగా నిర్వహించారు. జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో సేవాలాల్ చిత్రపటం వద్ద కేక్‌ను కట్‌చేశారు. దీనికిముందు తెనాలి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయ్ కొర్రా కాలనీవాసులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. జయంతి వేడుకలో న్యాయమూర్తి మోతీలాల్, సేవాసంఘం అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్, రాము, లక్ష్మణ్, శత్రు తదితరులు పాల్గొన్నారు.



బాలల్లో క్యాన్సర్ లక్షణాలపై అవగాహన

తెనాలి: అంతర్జాతీయ పిల్లల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లల్లో వచ్చే క్యాన్సర్ లక్షణాలు, నివారణపై డాక్టర్ పావనీ ప్రియాంక అవగాహన కల్పించారు. కీళ్లనొప్పులు, బరువు తగ్గడం, ఎక్కువగా అలసిపోవటం, దీర్ఘకాలంగా కంటిలో తెల్లని మచ్చ వంటివి పిల్లల క్యాన్సర్‌లో కనిపించే లక్షణాలుగా తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం, సూర్యకిరణాలు తగిలేవిధంగా చూసుకోవటం, వ్యాక్సిన్స్ వేయించుకోవటం, ఆరోగ్యం మెరుగ్గా ఉండేలా చూసుకుంటూ క్యాన్సర్ నుంచి దూరంగా ఉండొచ్చని తెలిపారు. బాల్యంలో క్యాన్సర్ నుంచి బయటపడిన వారికి యుక్తవయసు వరకు మానసిక ఆందోళన ఉండొచ్చని చెప్పారు. ప్రాణాలతో పోరాడి క్యాన్సర్‌ను గెలిచిన పిల్లల్లో పలువురికి కొన్ని అనారోగ్య సమస్యలు రావొచ్చని చెప్పారు. దీర్ఘకాలంగా ఆందోళన, బాధ, క్యాన్సర్ వస్తుందేమోనన్న భయం వంటివి పిల్లల్లో క్యాన్సర్‌కు కారణాలుగా తెలిపారు. అంతర్జాతీయ పిల్లల క్యాన్సర్ దినోత్సవంపై అవగాహనకు గుర్తుగా గోల్డ్ రిబ్బన్‌తో సూచిస్తారని వివరించారు. 39వ వార్డు కౌన్సిలరు వీర్లపాటి విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, నాళం శ్రీమన్నారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పావనీ ప్రియాంక

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మైనింగ్, సెబ్ అధికారులు సీజ్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెసర్లంక-పెదలంక పరిధిలోని కృష్ణా నదిలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్న సమాచారంతో బాపట్ల మైనింగ్ శాఖాధికారులు క్వారీలో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కొల్లూరు పోలీసులకు అప్పగించారు. వేమూరు సెబ్ అధికారులు చేపట్టిన తనిఖీలలో ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

నేడు ఉరుసు మహోత్సవం

కర్లపాలెం: హజరత్ బాజీ సహేద్‌బాబా 41వ ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం నాగరాజుపాలెంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని దర్గా ముజావర్ షేక్ పీరా అహ్మద్, గ్రామపెద్దలు గురువారం తెలిపారు. హాజరయ్యే భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తామని చెప్పారు.